బ్లడ్ కేన్సర్‌పై అవగాహన అవసరం

ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు



కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ప్రతి ఒక్కరూ బ్లడ్ కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ కాలేజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాసంస్థల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో లుంబినీ పార్కు నుంచి ఎంఎన్‌జే హాస్పిటల్ వరకు బ్లడ్ కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ అనేక మంది మహిళలు బ్లడ్ కేన్సర్‌పై అవగాహన లేమితో సరైన చికిత్స పొందలేకపోతున్నారని అన్నారు. ప్రాథమిక దశలో కేన్సర్‌ను తెలుసుకుంటే అతిసులువుగా నియంత్రించవచ్చని చెప్పారు. కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజ వివేక్ ప్రారంభించగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు పాల్గొని కరపత్రాలు పంచుతూ ప్రజల్లో చైతన్యం నింపారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

అరోరా కల్చరల్ ఫెస్ట్‌లో కొరియోగ్రాఫర్ ఆట సందీప్



అభియాన్ కల్చరల్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న డాక్టర్ విశ్వనాథం బులుసు



అరోరా కళాశాలలో జరిగిన కల్చరల్ ఫెస్ట్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: 'ఎవరైనా నాకు ఏదీ రాదు.. నాతో ఏమీ కాదనుకోకూడదు. పట్టుదలతో ఏదైనా సాధించగలం' అని షాట్‌కట్ సినిమా హీరో, ప్రముఖ కొరియోగ్రాఫర్ ఆట సందీప్ మాస్టర్ అన్నారు. 'విద్యార్థులు ఏ విషయంలోనూ నిరాశ పడకుండా క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను చేరుకుంటారు' అని అన్నారు. శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని అరోరా డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో అభియాన్–2024 పేరిట నగరంలోని ఇంటర్ విద్యార్థులకు కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. డ్యాన్స్, క్విజ్, డిబెట్, రీల్ మేకింగ్, మెహందీ, సింగింగ్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆట సందీప్ మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అరోరా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వనాథం బులుసు మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వినోదం కూడా అవసరమని అన్నారు. కార్యక్రమంలో అరోరా విద్యాసంస్థల సెక్రెటరీ డాక్టర్ రమేష్ బాబు, సినీ నటి వసుమతి వారకల, ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ మీరా జోషీ, డాక్టర్ పద్మిని, అధ్యాపకులు చంద్రకళ, రాహుల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ సిబ్బందిని నియమించాలి



సుందరయ్యపార్కులో టాయిలెట్ల నిర్వాహణను పరిశీలించిన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వివేక్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన సుందరయ్య పార్కును సుందరంగా తీర్చిదిద్దడంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి, జీహెచ్‌ఎంసీ అధికారులు చేసిన కృషికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఆర్.వివేక్ అన్నారు. నూతనంగా నిర్మించిన టాయిలెట్లను శనివారం వాకర్స్ క్లబ్ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. పార్కులో ఇటీవల లక్ష రూపాయలు పెట్టి మరమ్మతులు చేయించిన టాయిలెట్లను శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బంది లేకపోవడంతో దుర్గంధపూరితంగా మారాయని విచారం వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి శానిటరీ సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కందూరి కృష్ణ, క్లబ్ ఉపాధ్యక్షులు రాజు, సీనియర్ వాకర్ రాయపాటి రవి, బంగ్లా రాజు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగాలను వదిలించుకునేందుకు కుట్ర

ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేత శ్రీకాంత్ మిశ్రా



ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ సదస్సులో మాట్లాడుతున్న శ్రీకాంత్ మిశ్రా

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం సరళీకరణ విధానాల్లో భాగంగా ప్రభుత్వ రంగాలన్నింటినీ వదిలించుకునేందుకు కుట్ర చేస్తోందని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా విమర్శించారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలను వదిలించుకోవడం దేశ ఆర్థిక అభివృద్ధికి గొడ్డలిపెట్టు అని అన్నారు. సామాజికంగా వెనుకబడిన వారందరికి చేయూతనిచ్చేవిధంగా కాకుండా కార్పొరేట్ శక్తులకు లాభం కలిగే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు పాలక పార్టీలు మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఎల్‌ఐసీ హైదరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. తిరుపతయ్య మాట్లాడుతూ దేశంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వరంగ సంస్థలైన బీమా, బ్యాంకులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.మద్దిలేటి, ఎస్. గుణశేఖర్, కె.వేణుగోపాల్, పీఎస్ రవి, కె.ఎస్ రాజశేఖర్, పి.సతీష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలతో ప్రోత్సాహం



పురస్కారాలను ప్రదానం చేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: పురస్కారాలు ప్రతిభను మరింత ప్రోత్సహించేందుకు దోహదపడతాయని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. సత్యసంగీత ఇంటర్నేషనల్ సాంస్కృతిక సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో సామాజిక సేవామూర్తులు, వైద్యులకు జరిగిన పురస్కారాల ప్రదానోత్సం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్ సంగీతం ఉత్సాహాన్నిస్తుందని, శ్రవణానందంగా పాటలు ఆలపించిన గాయనీగాయకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞ శర్మ, శశిబాల, ఉపేంద్రనాథ్, ఓంకార్ రాజు, శైలజ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల చట్టాల అమలులో..

ప్రభుత్వాలు విఫలం

ఎన్‌పీఆర్‌డీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నంబూ రాజన్



సదస్సులో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నంబూ రాజన్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: వికలాంగుల చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నంబూ రాజన్ విమర్శించారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో వికలాంగులకు సామాజిక భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల విద్య, ఉపాధి కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో 15 శాతం మంది వికలాంగులు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాలు 49.5 శాతం మందికి మాత్రమే అందుతున్నాయని చెప్పారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్, నేషనల్ పాలసీ వంటి చట్టాలున్నా ఎలాంటి మేలు కలగడంలేదన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్, యశోధ, రాజు, కవిత, బస్వరాజ్, దశరత్, కాశప్ప, ఉపెందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూను పరిశ్రమలతో అనుసంధానం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులకు నాణ్యతాప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ పరిశ్రమలతో అనుసంధానం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. శనివారం వీసీ ప్రొ.కుమార్‌ను కలసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, టీపీసీసీ రాష్ట్ర నాయకులు దరువు ఎల్లన్న, దుర్గం భాస్కర్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



మాలబస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: డివిజన్‌లోని బస్తీ ప్రజల సమస్యలపట్ల ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. శనివారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నాయకులతో కలసి మాల బస్తీలో పర్యటించారు. బస్తీలో నెలకొన్న సివరేజీ పైప్‌లైన్, మంచినీటి లోప్రెషర్, వెలగని వీధిదీపాలు, గుంతల రోడ్లు వంటి సమస్యలపై స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే జీహెచ్‌ఎంసీ సిబ్బందిని బస్తీకి రప్పించి గుంతలు పడ్డ చోట రోడ్లకు మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మదన్‌మోహన్,అరుణ్‌కుమార్, సాయితేజ, భాను, మాలబస్తీ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్, సభ్యులు వెంకటేష్, సునీల్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో రామానుజన్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీలోని స్టాటిస్టిక్స్ విభాగంలో రామానుజన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శనివారం సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ కార్యాలయం ఆడిటోరియంలో జరిగిన జయంతి ఉత్సవాలకు ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీజీసీవోఎస్‌టీ) స్పాన్సర్‌తో డేటా సైన్స్‌లో ఇటీవలి పోకడలు అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించారు.

దక్షిణాది రాష్ట్రాలపై కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం

ఉస్మానియా యూనివర్సిటీ: దేశాన్ని 50 ఏళ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ దక్షిణాదికి ఏం చేసిందని సౌతిండియా పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి పాలన పై అవగాహన లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు కూడా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా దక్షిణాది అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా, కర్ణాటకలో సౌతిండియా పబ్లిక్ కమిషన్, కేరళలో దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు ప్రత్యేక ప్యాకేజీ, పాండిచ్చేరిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్ హత్యకు బీజేపీ కుట్ర

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆప్ నేతలు

కవాడిగూడ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను హత్య చేసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని, అందులో భాగంగానే ఆయనపై బీజేపీ యువ మోర్చా గూండాలతో దాడి చేయించిందని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. కేజ్రీవాల్‌పై దాడిని నిరసిస్తూ శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో నల్ల జెండాలు ప్రదర్శించారు. కేజ్రీవాల్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీకి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సుధాకర్ మాట్లాడుతూ ఢిల్లీ వికాస్‌పురిలో శాంతియుతంగా పాదయాత్ర నిర్వహిస్తున్న కేజ్రీవాల్‌పై బీజేవైఎం గూండాలు పోలీసుల సమక్షంలోనే దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ దాడిని ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా హింసారాజకీయాలను బీజేపీ మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, ఎంఏ మసీద్, సల్మాన్‌రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమా జిల్లోజు, నర్సింగ్ యమునాగౌడ్, నేతలు జావిద్, శివాజీ, రాకేష్‌సింగ్, సుధారాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మట్టిదిబ్బలు, చెత్తకుప్పలు తొలగించండి

ఆర్టీసీ కాచిగూడ డిపో మేనేజర్ రఘు



పేరుకుపోయిన చెత్తకుప్పలు, మట్టిదిబ్బలను చూపుతున్న డిపో మేనేజర్ రఘు

కాచిగూడ: ఆర్టీసీ కాచిగూడ డిపో రోడ్డులో రోడ్డు కిరువైపులా మట్టి దిబ్బలు, చెత్తకుప్పలు పేరుకుపోయి స్థానికులు, వాహనదారులు, పాదచారులతోపాటు సిబ్బంది, ఉద్యోగులు, నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని డిపో మేనేజర్ టి.రఘు తెలిపారు. ఈ మేరకు శనివారం జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట డీఎంసీకి లేఖ రాశారు. డిపోలో 640 మంది సిబ్బంది పని చేస్తున్నారని, డిపోకు అనుకుని చెత్త, మట్టికుప్పలు పేరుకుపోవడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నారని, సిబ్బంది అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. ప్రజల, ఉద్యోగుల ఆరోగ్య దృష్ట్యా చెత్తను వెంటనే తొలగించి, చెత్త వేసేవారిపై చర్యలు తీసుకునేలా చూడాలని ఆయన కోరారు.

దేశ ఆర్థికవృద్ధిలో సీఎంఏల పాత్ర కీలకం

బిభూతి భూషణ్ నాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిభూతి భూషణ్ నాయక్

కవాడిగూడ: దేశ ఆర్థిక అభివృద్ధిలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ పాత్ర కీలకమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ ఆలిండియా అధ్యక్షుడు బిభూతి భూషణ్ నాయక్ అన్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ (సీఎంఏ) పాత్రపై శనివారం దోమలగూడలోని సీఎంఏ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిభూతి భూషణ్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం, పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల్లో సీఎంఏ సేవలు చాలా అవసరమని వివరించారు. ఫ్యాక్టరీల్లో అకౌంటెంట్లుగా ప్రారంభమై కార్పొరేట్ సంస్థల్లో మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్‌గా ఎదుగుతున్నారని చెప్పారు. పన్నులు, కార్పొరేట్ చట్టాలు, మధ్యవర్తిత్వం, దివాలా, వాల్యూయేషన్, సోషల్ ఆడిటింగ్, స్వతంత్ర్య డైరెక్టర్ షిప్, బ్యాంకింగ్, బీమా రంగాలకు సీఎంఏ సేవలు విస్తరించాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీఎంఏఐ సెంట్రల్ కౌన్సిల్‌సభ్యులు డాక్టర్ కె.సీహెచ్ఏవీఎస్ మూర్తి, హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ డాక్టర్ లావణ్య కందూరి, సీఎంఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో పోలియోను నివారించవచ్చు



డాక్టర్ శ్రీనివాస్ కళ్యాణి

చిక్కడపల్లి: టీకాలతో పోలియోను నివారించవచ్చని డాక్టర్ శ్రీనివాస్ కళ్యాణి అన్నారు. ప్రపంచ పోలియో వారోత్సవాల సందర్భంగా చిక్కడపల్లిలో శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేఘాలయలో ఇటీవల బయటపడిన పోలియో కేసు నేపథ్యంలో పోలియోమైలిటీస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరమన్నారు. ఐదేళ్లలోపు పిల్లలను పోలియో వ్యాధి ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ఇది కోలుకోలేని పక్షవాతానికి, కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుందన్నారు. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ఇంకా ముప్పుగానే ఉందన్నారు. పోలియో నివారణలో భాగంగా ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు కొనసాగించటం, టీకాల ఆవశ్యకత, ఆరోగ్య పరీక్షల ప్రాధాన్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. భారత దేశంలో గత 12 సంవత్సరాలుగా పోలియో కేసు లేదని, ఇది అసాధారణ ప్రజారోగ్య విజయమని అన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అడ్వైజరీ కమిటీ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యునైజేషన్ ప్రాక్టిసెస్ సిఫార్సు చేసిన టీకా షెడ్యూల్‌ను ఖచ్చితంగా అనుసరించాలని సూచించారు.

8, 9 తేదీల్లో వైఎంసీఏ వాలీబాల్ టోర్నమెంట్

కాచిగూడ: నవంబర్ 8, 9 తేదీల్లో 4వ వార్షిక వైఎంసీఏ డాక్టర్ నందన్ సింగ్ వాలీబాల్ ప్రైజ్ మనీ టోర్నమెంట్–2024ను నిర్వహిస్తున్నట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి ఎం.ప్రీస్టలీ గైస్ తెలిపారు. శనివారం నారాయణగూడ లోని వైఎంసీఏలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్, నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనడానికి 17 ఏళ్లలోపు స్కూల్ బాయ్స్ అండ్ గరల్స్ అర్హులని పేర్కొన్నారు. పోటీలో నారాయణగూడ వైఎంసీఏ గ్రౌండ్స్‌లో జరుగుతాయని, పోటీల్లో పాల్గొనేవారు నవంబర్ 7వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 77996 64455/70326 60614లలో సంప్రదించాలని సూచించారు.

అన్నమయ్య పాటపై తరగతులు

నల్లకుంట: ప్రతినోట అన్నమయ్యపాటపై తరగతులు పునఃప్రారంభం అవుతున్నాయని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమి డైరెక్టర్ గారీభట్ల వసుధామూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవిడ్ సమయంలో ఈ తరగతులు నిలిపివేశామని, ఇప్పుడు పరిస్థితులు మెరుగుపడటంతో తిరిగి ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. కొత్తపేట మోహన్‌నగర్, కమర్షియల్ ట్యాక్స్ కాలనీలో ఉన్న శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమిలో ఈ తరగతులు ప్రతి ఆదివారం సాయంత్రం 3 నుంచి 4.30 గంటల వరకు ఉంటాయన్నారు. ఇందులో అరుదైన అన్నమయ్య కీర్తనల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. వయోపరిమితి లేదని, అన్ని వయస్సుల వారు ఈ తరగతులకు హాజరు కావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 83749 27736 నంబర్‌లో సంప్రదించవచ్చు.

సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు



మల్లికార్జుననగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతుకు చర్యలు చేపడుతున్నట్టు కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్‌లోని మల్లికార్జున నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతాప్రమాణాలతో సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. వర్షాకాలం ముగియడంతో అధ్వానంగా ఉన్న రహదారులను తక్షణమే మరమ్మతు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డితోపాటు జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా శ్రీ కీర్తన సంగీత అకాడమీ వార్షికోత్సవం



శ్రీ కీర్తన సంగీత అకాడమీ వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: శ్రీ కీర్తన సంగీత అకాడమీ 4వ వార్షికోత్సవం శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ విద్యావేత్త గిరిజా శివదాస్ మాట్లాడుతూ సాంస్కృతిక సంప్రదాయాలకు మనదేశం ప్రపంచానికే తలమానికమని అన్నారు. ఈ సందర్భంగా సంగీత అకాడమీ విద్యార్థులు ఆలపించిన భక్తిగీతాలు, అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలు సభికులను అలరించాయి. అనంతరం విద్యార్థులను మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంగీత అకాడమీ గురువు సుష్మావేదగిరి, నిర్వాహకులు విజయ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు



కవాడిగూడ: ఉస్మానియా యూనివర్సిటీ నూతన వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాదిగ జర్నలిస్ట్స్ ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.జహంగీర్, నేతలు సామ్రాట్ అజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కాచిగూడ: ఆర్టీసీ కాచిగూడ బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(60) మృతదేహం లభ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383